RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

తాగునీరు కల్పించడమే ప్రధాన లక్ష్యం 2


| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 171 | జులై 22 బుధవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 171 | July 22 Wednesday2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


## సిక్కింలో ఘోర ప్రమాదం

### కొండచరియలు విరిగిపడటంతో పది మంది మృతి




**సిక్కిం జనసంఘర్షణ**
సిక్కింలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. దక్షిణ సిక్కింలోని సమర్‌దుంగ్ ప్రాంతంలో తీస్తా స్టేజ్- జలవిద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించిన సొరంగం పనులు జరుగుతుండగా, అకస్మాత్తుగా కొండచరియలు విరిగిపడటంతో పదముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. నామ్చి జిల్లా కలెక్టర్ అనుప తమ్లింగ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. పటేల్ ఇంజినీరింగ్ సంస్థ ఆధ్వర్యంలో పనులు జరుగుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. కొండచరియలు పడటంతో సొరంగం మార్గం పూర్తిగా మూసుకుపోవడమే కాకుండా, లోపల ఉన్నట్టుండి మిథేన్ గ్యాస్ లీక్ కావడం పరిస్థితిని మరింత సంక్లిష్టంగా మార్చింది.
ప్రమాద సమయంలో మరికొందరు కార్మికులతో పాటు ఎన్‌హెచ్‌పీసీ (చీన్గూజ) కి చెందిన ఆరుగురు సిబ్బంది కూడా శిథిలాల కింద చిక్కుకున్నట్లు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న జాతీయ, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళాలు, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే, సొరంగంలో విషపూరితమైన మిథేన్ గ్యాస్ తీవ్రత అధికంగా ఉండటంతో మొదట లోపలికి వెళ్లిన సహాయక బృంద సభ్యులు

మిగతా 2వ పేజిలో..

## ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు

# పటిష్ట చర్యలు

## మంత్రి పొంగులేటి స్పష్టం




**వరంగల్ జనసంఘర్షణ**
రాష్ట్రంలో ఎల్‌నీనో ప్రభావం వల్ల సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున, వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందస్తు కార్యాచరణ చేపట్టింది. హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కలిసి వివిధ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ప్రత్యేక అధికారులు కంటింజెన్సీ ప్రణాళికలు: ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. వర్షాభావ ప్రభావాన్ని తట్టుకునేందుకు కంటింజెన్సీ ప్రణాళికలను సమర్థంగా అమలు చేయాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పరిస్థితులను పర్యవేక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక

మిగతా 2వ పేజిలో..

# నీట్ లీక్‌పై స్పందించిన మోడీ

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారిగా స్పందించారు. 'మంగళ్ మిలన్' పేరిట నిర్వహించిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పేపర్ లీకేజీ అనేది తీవ్రమైన నేరమని, ఇలాంటి ఘోర పాపాలు పునరావృతం కాకుండా చూడడం జాతీయ బాధ్యత అని ఉద్ఘాటించారు. ఈ కుంభకోణానికి బాధ్యులైన నిందితులపై అత్యంత కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రధాని ప్రసంగించిన వివరాలను కేంద్రమంత్రి కిరణ్ రిజిజు మీడియాకు వెల్లడించారు. రాజకీయ అభిప్రాయభేదాలు ఉన్నప్పటికీ దేశ భవిష్యత్తు, యువత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పార్లమెంట్‌లో నిర్మాణాత్మక చర్చలు జరిపేందుకు విపక్షాలు సహకరించాలని ప్రధాని కోరారు. విద్యార్థులను భావోద్వేగాలకు గురిచేసి రెచ్చగొట్టవద్దని సూచిస్తూ.. తప్పుడు మార్గంలోకి వెళ్లడం సులభమే అయినా, తిరిగి సరైన మార్గానికి తీసుకురావడం చాలా కష్టమని వ్యాఖ్యానించారు. యువతను సరైన



దిశలో నడిపించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులందరిపైనా ఉందన్నారు. గత మే నెలలో జరిగిన నీట్ పరీక్షలో లీకేజీ ఆరోపణలు రావడంతో జూన్‌లో

# బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం



**హైదరాబాద్ జనసంఘర్షణ**
హైదరాబాద్‌లోని ప్రసిద్ధ బల్కంపేట ఎల్లమ్మ తల్లి కళ్యాణోత్సవం ఆషాఢ మాసం సందర్భంగా అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారి కళ్యాణాన్ని తిలకించేందుకు నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీమణి, వారి కుమార్తెతో కలిసి ఉత్సవానికి హాజరై అమ్మవారికి ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు. ఈ వేడుకల్లో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఎగ్రూల రాక మరియు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేశారు. కళ్యాణం అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు

మిగతా 2వ పేజిలో..

# అస్సాం, జమ్మూల్లో భారీ వర్షాలు

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
వరసగా కురుస్తున్న భారీ వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలతో దేశంలోని అస్సాం, జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాలు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయాయి. ఒకవైపు కొండచరియలు విరిగిపడటం, మేఘ విస్ఫోటాలు సంభవిస్తుండగా.. మరొకవైపు నదులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తూ విస్తారమైన నష్టాన్ని కలిగిస్తున్నాయి. అస్సాంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానల

మిగతా 2వ పేజిలో..



# ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు పటిష్ట చర్యలు

**మొదటిపేజీ తరువాయి...** అధికారులను నియమించగా, ఉమ్మడి వరంగల్ జిల్లా బాధ్యతలను సీనియర్ ఐఏఎస్ అధికారి దేవసేనకు అప్పగించినట్లు తెలిపారు. తాగునీరు, భూగర్భ జలాలు, వ్యవసాయ పరిస్థితులపై ఈ అధికారులు ఇచ్చే నివేదికల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా అవసరమైన సహాయాన్ని కోరనున్నట్లు వెల్లడించారు.

రైతులకు ప్రత్యామ్నాయ సాగు అవగాహన: రైతులు వరి, పత్తి వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లేలా వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ప్రత్యేకించి లెమన్ గ్రాస్ వంటి అధిక ఆదాయాన్నిచ్చే పంటలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. దాంతోపాటు పశుసంవర్ధక రంగానికి ఇబ్బంది కలగకుండా పశుగ్రాసం, తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**తాగునీరు  దేవాదుల ప్రాజెక్ట్ నిర్వహణ:**

తాగునీటి లభ్యతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, దేవాదుల ప్రాజెక్టు మోటార్లు ప్రతిరోజూ పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా మరమ్మతులు వస్తే 24 గంటల్లోగా పూర్తి చేయాలని స్పష్టం చేస్తూ, ఈ ప్రక్రియ మొత్తాన్ని ములుగు జిల్లా కలెక్టర్ పర్యవేక్షిస్తారని తెలిపారు. ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ చేస్తోందని, రైతులు మరియు ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు.

ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి, కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డితో పాటు ఉమ్మడి వరంగల్ పరిధిలోని కలెక్టర్లు, పలువురు ముఖ్య ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోంది..

హైదరాబాద్

కాళేశ్వరం మరియు దేవాదుల ప్రాజెక్టుల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను తీవ్రంగా మోసం చేస్తోందని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తనీశీళ్ హరీశ్ రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కార్ తీవ్ర నేరపూరిత నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. దేవాదుల విషయంలో కాంగ్రెస్‌ది నాటి నుంచీ నేటి దాకా ద్రోహపూరిత వైఖరేనని ధ్వజమెత్తారు.

గోదావరి నీళ్లు వృథా -- వరంగల్ రైతులకు మోసం:

జూన్ 1 నుంచి ఇప్పటివరకు సమ్మక్క బ్యారేజీ నుంచి సుమారు 105 టీఎంసీల నీరు దిగువకు ప్రవహించి ఆంధ్రాకు తరలిపోయినా ప్రభుత్వం పట్టించుకోలేదని హరీశ్ రావు ఆరోపించారు. 50 రోజుల్లో 12 టీఎంసీలు ఎత్తిపోసే అవకాశం ఉన్నప్పటికీ, ప్రభుత్వం కనీసం 2 టీఎంసీలు కూడా ఎత్తిపోయలేకపోయిందని విమర్శించారు. దేవాదుల వద్ద మోటార్లు నడవడానికి 73 మీటర్ల నీటిమట్టం సరిపోతుందని, ప్రస్తుతం 78 మీటర్ల ఎత్తులో నీరు ప్రవహిస్తున్నా పంపులను నడపకపోవడం వైఫల్యమేనన్నారు. బీఆర్ఎస్ ప్రెస్ మీట్ పెట్టగానే హడావుడిగా రెండు మోటార్లు స్టార్ట్ చేశారని నిలదీశారు.

పరస్పర విరుద్ధ వ్యాఖ్యలు ఉ పాకాల, రామప్ప రైతుల ఆవేదన:

ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 10 మోటార్లు నడిపి నీళ్లిస్తామని చెప్పగా, వరంగల్ కలెక్టర్ మాత్రం నీళ్లు ఇవ్వలేమని చెబుతున్నారని.. ప్రభుత్వంలో మంత్రులది ఒక మాట, అధికారులది ఒక మాటగా ఉందనడానికి ఇదే నిదర్శనమని ఎద్దేవా చేశారు. మంత్రుల మాటలు నమ్మి నాట్లు వేసుకున్న పాకాల, రామప్ప ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. అధికారులతో తూములు మూయించి రైతులను సంక్షోభంలోకి నెట్టారని, పంటలను కాపాడుకునేందుకు రైతులు ట్యాంకర్లు, బిందెలతో నీళ్లు పోసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సరైన సమయంలో స్పందించకపోతే రైతులను కాపాడేందుకు 'క్రాప్ హాలిడే' ప్రకటించి నష్టపరిహారం చెల్లించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

# సిక్కింలో ఘోర ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి...** కూడా శ్వాసకోశ సమస్యలకు గురై ఆస్పత్రి పాలయ్యారు. ప్రస్తుతం ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ లోపల చిక్కుకున్న వారిని కాపాడేందుకు ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి.

# నీట్ లీక్‌పై స్పందించిన మోడీ

**మొదటిపేజీ తరువాయి...** మళ్లీ పరీక్ష నిర్వహించాల్సి రావడం, సీబీఎస్ఈ ఆన్‌స్క్రీన్ మార్కింగ్ విధానంలో లోపాలు వెలుగు చూడటంతో దేశ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, విద్యావ్యవస్థలో తక్షణ సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ 'కాక్రోచ్ జనతా పార్టీ' నిర్వహించిన 'చలో పార్లమెంట్' ముట్టడి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసిన నేపథ్యంలో ప్రధాని మోదీ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# అస్సాం, జమ్మూల్లో భారీ వర్షాలు

**మొదటిపేజీ తరువాయి...** వల్ల జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. ఇప్పటివరకు వరదల కారణంగా 10 మంది ప్రాణాలు కోల్పోగా, సుమారు 3.62 లక్షల మంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలోని 16 జిల్లాల్లోని 794 గ్రామాలు నీటమునిగాయి. బ్రహ్మపుత్రతో పాటు బుర్హిదిహింగ్, దిసాంగ్, ధన్‌సిరి, దిఖౌ నదులు ప్రమాద హెచ్చరికలను దాటి ప్రవహిస్తుండటంతో జనావాసాలు, రోడ్లు జలమయమయ్యాయి. అలాగే దాదాపు 19,100 హెక్టార్లలో పంటలు నీట మునిగి రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. బాధితులను కాపాడేందుకు అధికారులు 101 సహాయక శిబిరాలను ఏర్పాటు చేసి నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో నదుల నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

**జమ్మూ కాశ్మీర్‌లో మేఘ విస్ఫోటం - విరిగిపడిన కొండచరియలు:**

ఇటు జమ్మూ కాశ్మీర్‌లో సంభవించిన మేఘ విస్ఫోటం (క్లౌడ్ బరస్ట్) తీరని విషాదాన్ని మిగిల్చింది. కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదల వల్ల సరిహద్దు జిల్లాలైన పూంఛ్, రాజౌరీల్లో ఇప్పటికే 12 మంది మృతి చెందగా, మరికొందరు గల్లంతయ్యారు. ముఖ్యంగా పూంఛ్ జిల్లాలోని సురన్ కోట్ తెహసీల్‌లో విధ్వంస తీవ్రత ఎక్కువగా ఉంది. ఇక్కడ ఒకే కుటుంబానికి చెందిన మూడంతస్తుల ఇల్లు బురదలో కూరుకుపోయి ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరం.

ఈ తీవ్ర పరిస్థితుల దృష్ట్యా, రాష్ట్ర హోదా కోసం ఢిల్లీలో తలపెట్టిన ఆందోళనను విరమించుకుని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా హుటాహుటిన జమ్మూకు చేరుకుని పరిస్థితులను సమీక్షిస్తున్నారు. మరోవైపు వర్షాల తీవ్రత కారణంగా రియాసి జిల్లాలోని ప్రసిద్ధ మాతా వైష్ణోదేవి యాత్రను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. రోడ్లు, భవనాలు దెబ్బతినడంతో సహాయక చర్యలకు ఆటంకాలు ఏర్పడుతున్నప్పటికీ, యంత్రాంగం రంగంలోకి దిగి సహాయక చర్యలను ముమ్మరం చేసింది.

# తాగునీరు కల్పించడమే ప్రధాన లక్ష్యం

వరషాభావ పరిస్థితుల దృష్ట్యా ప్రజలకు తాగునీరు, సాగునీటి భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రాజకీయ విమర్శలకు ప్రాధాన్యం ఇవ్వబోమని రాష్ట్ర నీటిపారుదల మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సచివాలయంలో మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడిన ఆయన, దేవాదుల ఎత్తిపోతల పథకం కింద 9 పంపింగ్ యూనిట్లు పూర్తి సామర్థ్యంతో 24 గంటల పాటు పనిచేస్తాయని వెల్లడించారు. గోదావరి నుంచి వీలైనంత ఎక్కువ నీటిని ఎత్తిపోసి, దేవాదుల పరిధిలోని 9 జిల్లాలకు చెందిన 22 రిజర్వాయర్లను నింపడానికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

దేవాదుల ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యతతో ముందుకు తీసుకెళు న్నామని, భూసేకరణ, మిగిలిన నిర్మాణ పనులను వేగవంతం చేసి 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఉత్తర తెలంగాణ జిల్లాల్లో తాగునీటి భద్రత పెరగడంతో పాటు సుమారు 5.6 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు.

అదే సమయంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ నేత హరీశ్ రావుపై మంత్రి తీవ్ర విమర్శలు చేశారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో షీట్ పైల్ ఫౌండేషన్ డిజైన్‌ను సెకెంట్ పైల్ ఫౌండేషన్‌గా ఎందుకు మార్చారో వివరించాలని డిమాండ్ చేశారు. ఆ తప్పుడు నిర్ణయం వల్లే కాళేశ్వరం ప్రాజెక్టుకు ఈ దుస్థితి వచ్చిందన్నారు. అంతేకాకుండా, కాళేశ్వరం కాంట్రాక్టర్ల నుంచి బీఆర్ఎస్‌కు రూ.1,400 కోట్లు వచ్చాయని ఎమ్మెల్సీ కవిత చేసిన ఆరోపణలపై హరీశ్ రావు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం

**మొదటిపేజీ తరువాయి...**కలగకుండా ముందుగానే సమీక్షలు నిర్వహించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ముఖ్యంగా వికలాంగులు, జోగినులకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయడం వల్ల తొక్కిసలాటలు జరగకుండా ఉత్సవం ప్రశాంతంగా ముగిసిందన్నారు. జోగినులకు సముచిత ప్రాధాన్యత ఇస్తూ, వారు తెచ్చిన పట్టువస్త్రాలను అమ్మవారికి అలంకరించడంతో పాటు విఐపి గ్యాలరీలో వారికి ప్రత్యేక స్థానం కల్పించినట్లు వెల్లడించారు. బోనాల ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించిందని, ప్రస్తుతం రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని కోరుకుంటూ వరుణయాగం కూడా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. లోక కళ్యాణం కోసం బల్కంపేట ఎల్లమ్మ తల్లి వివాహ మహోత్సవం ఎంతో ఘనంగా నిర్వహించామన్నారు. ఎన్-లీనో వంటి వాతావరణ సవాళ్లను ఎదుర్కొని, అమ్మవారి కృపాకటాక్షాలతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, తెలంగాణ సుభిక్షంగా వర్ధిల్లాలని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా చిన్న చిన్న సమస్యలు ఎదురైనా దేవాదాయ శాఖ తరఫున ఆషాఢ బోనాలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు.

# ప్రధాని నివాసం ముందు కాంగ్రెస్ నేతల ఆందోళన

**కాంగ్రెస్ ధర్నాతో స్వల్ప ఉద్రిక్తత**

**బలవంతంగా అరెస్ట్ చేసి తరలించిన పోలీసులు**

**రాహుల్ సహా కాంగ్రెస్ నేతల అరెస్ట్**

**న్యూఢిల్లీ, :**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నివాసం ముందు ఆందోళన చేసిన రాహుల్ గాంధీ.. కాంగ్రెస్, మిత్రపక్షాల ఎంపీలను పోలీసులు మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కి తరలించారు. మందిర్ మార్గ్ పోలీసు స్టేషన్‌లో ఉన్న ఎంపీలను కలిసేందుకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్ పర్సన్ సోనియా గాంధీ వెళ్లారు. అయితే, పోలీసులు సోనియాగాంధీని లోపలికి అనుమతించలేదు. భారత ప్రధాని నరేంద్ర మోదీ నివాసం దగ్గర కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధర్నా చేపట్టారు. సోమవారం జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు నిరసనగా చేపట్టిన ఈ ధర్నాలో రాహుల్‌తో పాటు ఖర్గే, కేసీ, ప్రియాంక, పలువురు కాంగ్రెస్, మిత్ర పక్షాల ఎంపీలు పాల్గొన్నారు. కాంగ్రెస్ నేతలు చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. ఈ నిరసనలు ఉద్రిక్తతకు దారి తీయటంతో పోలీసులు బలవంతంగా వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాహుల్, ఖర్గే, ప్రియాంకలను అరెస్ట్ చేసి బలవంతంగా తరలించారు. ఇకపోతే మంగళవారం ఈ నిరసనలు పొలిటికల్ టర్న్ తీసుకున్నాయి. కాంగ్రెస్ నేతలు ప్రధాని నరేంద్రమోడీ నివాసం ముందు ధర్నా చేశారు. కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లికార్జున ఖర్గే, కర్ణాటక, కేరళ సీఎంలు డీకే శివకుమార్, సతీషన్‌లు కూడా ఈ ధర్నాలో పాల్గొన్నారు. విద్యార్థులపై దాడికి నిరసనగా ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని పిలుపునిచ్చారు. అయితే కాంగ్రెస్ ధర్నా చేసిన ప్రాంతాన్ని పోలీసులు ఖాళీ చేయించారు. రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీను అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, కర్ణాటక, కేరళ సీఎంలు డీకే శివకుమార్, సతీషన్‌తో పాటు ఇతర కాంగ్రెస్ ముఖ్య నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని బస్సుల్లో తరలించారు. రాహుల్ గాంధీ, ప్రియాంకను పోలీసులు వేర్వేరు స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో వున్న ప్రియాంకా గాంధీ వాద్రాను కలిసేందుకు కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ అక్కడికి చేరుకున్నారు. తొలుత ఆమెను లోపలికి పంపేందుకు పోలీసులు నిరాకరించారు. ఆ తర్వాత కాసేపటికి లోపలికి పంపడంతో ప్రియాంకను ఆమె కలిశారు. ఇదిలా ఉండగా.. రాహుల్‌ను మోడల్ టౌన్‌లోని ఛత్రసాల్ స్టేడియానికి పోలీసులు తరలించినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. అంతకుముందు కాంగ్రెస్ ధర్నా వద్దకు వచ్చిన కేంద్ర సహాయ మంత్రి, ప్రధాని కార్యాలయ బాధ్యతలు చూస్తున్న జితేంద్ర సింగ్, కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్.. రాహుల్‌తో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కేంద్రం ముందు రాహుల్ ప్రధానంగా రెండు డిమాండ్లు ఉంచారు. ఎట్టిపరిస్థితుల్లో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నిన్న విద్యార్థులపై లాఠీఛార్జి చేసిన ఘటనపై పార్లమెంటు ఉభయ సభల్లో కేంద్రం స్పందించాల్సిందేనని పట్టుబట్టారు. ఈ విషయంలో

ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చే వరకు తాము ఈ ఆందోళనలు ఆపేది లేదని, ఇక్కడి నుంచి కదిలేది లేదని రాహుల్ తేల్చి చెప్పారు. ఆ తర్వాత దిల్లీ పోలీసులతో పాటు ఆర్‌పీఎఫ్, ఆర్ఏఎఫ్ బలగాలు భారీగా మోహరించి ప్రధాని నివాసం ముందు ధర్నా చేస్తున్న నేతలందరినీ అదుపులోకి తీసుకోవడంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. డిమాండ్లపై రాహుల్‌గాంధీ మాట మార్చారని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ విమర్శించారు. రాహుల్ సహా కాంగ్రెస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకోకముందు మీడియాతో ఆయన మాట్లాడారు. 'నీట్ అంశంపై లోక్‌సభలో చర్చించాలని తొలుత రాహుల్ కోరారు. దానిపై హామీ ఇస్తే ధర్నా విరమిస్తామన్నారు. పార్లమెంట్‌లో చర్చిస్తామని హామీ ఇచ్చాం. ఇప్పుడు మాట మార్చి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతున్నారు. ప్రతిపక్ష నేత హోదాలో ఇలా మాట మార్చడం సరికాదు. రాహుల్

# వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలి..

**పోతంగల్, జూలై 21 (జన సంఘర్షణ):** ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పోతంగల్ మండల వ్యవసాయ అధికారి సూచించారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను బట్టి పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని కోరారు. అధిక నీటి అవసరం కలిగిన వరి సాగు విస్తీర్ణాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించి, తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా కందులు, మొక్కజొన్న, పత్తితో పాటు జొన్న, సజ్జ, కొర్ర, సామలు, అరికెలు వంటి చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లో పంట నష్టాలను తగ్గించేందుకు పంటల వైవిధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నీరు ఎంత ఉందో చూసుకుని.. పంట ఏది వేయాలో నిర్ణయించుకోవాలి' అని రైతులకు సూచించారు. ప్రతి రైతు తన భూమి స్వభావం, నీటి లభ్యత, వర్షపాతం పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని కోరారు. భూమిలో తేమను ఎక్కువ కాలం నిల్వ ఉంచేందుకు అంతర దుక్కులు, కలుపు నివారణ, వర్షపు నీటి సంరక్షణ, పొలాల్లో నీటి నిల్వకు అనువైన చర్యలు చేపట్టాలని తెలిపారు. వర్షం కురిసిన సమయంలో నీటిని వృథాగా పోనివ్వకుండా పొలాల్లోనే సంరక్షించుకోవడం ద్వారా పంటలకు అవసరమైన తేమను అందించవచ్చని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన నాణ్యమైన, అధిక దిగుబడి ఇచ్చే, తక్కువ కాల వ్యవధి గల విత్తన రకాలను మాత్రమే రైతులు వినియోగించాలని సూచించారు. పంటల ఎంపిక, విత్తనాల లభ్యత, సాగు పద్ధతులు, పంటల యాజమాన్య పద్ధతులు, వర్షాభావ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పూర్తి సమాచారం కోసం రైతులు సమీప రైతు వేదిక, వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ)



లేదా పోతంగల్ మండల వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టి, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా ఖరీఫ్ సీజన్‌లో మెరుగైన దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి తెలిపారు. కార్యక్రమంలో పోతంగల్ మండల వ్యవసాయ శాఖ అధికారి, నిషిత, ఏవో, శంకర్, స్థానిక సర్పంచ్, నాగరాజు, ఉప సర్పంచ్ సంజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బుడిమి హరిహర దేవి ఆలయంలో ఘనంగా సామూహిక కుంకుమార్చన





❑ ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి...

**బాన్సువాడ గ్రామీణం, జూలై 21 (జన సంఘర్షణ):** ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని బాన్సువాడ గ్రామీణ మండలం బుడిమి గ్రామంలోని హరిహర దేవి ఆలయంలో మంగళవారం ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి ఆలయంలో హరిహర దేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ గురు మదనానంద సరస్వతి పీఠాధీశ్వరులు శ్రీ మాధవానంద సరస్వతి స్వామివారి సమక్షంలో నిర్వహించిన సామూహిక కుంకుమార్చన కార్యక్రమంలో పోచారం భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడగా, భక్తిశ్రద్ధలతో మహిళలు సామూహిక కుంకుమార్చనలో పాల్గొని అమ్మవారిని భక్తిపూర్వకంగా కొలిచారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ పట్టణ, గ్రామీణ మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు, ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు. భక్తుల ఆధ్యాత్మిక సందడితో బుడిమి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# రుద్రూర్ ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్యాధికారి ఆకస్మిక తనిఖీ

❑ వైద్య సేవలు, మందుల నిల్వలు, రికార్డులపై సమగ్ర పరిశీలన

**రుద్రూర్/జూలై 21/(జన సంఘర్షణ):** నిజామాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మంగళవారం రుద్రూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, వివిధ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి సూచించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. ముఖ్యంగా మందుల నిల్వలు, వాటి గడువు తేదీలు, పంపిణీ విధానాన్ని





ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. అలాగే ఆసుపత్రిలో నిర్వహిస్తున్న రిజిస్టర్లు, రోగుల వివరాలు, వైద్య సేవలకు సంబంధించిన రికార్డులను పరిశీలించిన జిల్లా వైద్యాధికారి, ప్రభుత్వ ఆరోగ్య సేవలు ప్రజలకు సక్రమంగా అందేలా అధికారులు, సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఎంతో కీలకమని, ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీతో రుద్రూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ మరింత పెరిగింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తనిఖీ సందర్భంగా ఆసుపత్రి సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

# బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు

❑ 33 మందికి కంటి పరీక్షలు.. 8 మందికి ఆపరేషన్ కోసం రిఫర్...



**బీర్కూర్, /జూలై 21 /(జన సంఘర్షణ)** బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గ్రామంలో ఉచిత కంటి వైద్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 33 మంది కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించగా, వారిలో 8 మందికి కంటి శస్త్రచికిత్స అవసరమని గుర్తించి బోధన్ లయన్స్ ఆసుపత్రికి ఆపరేషన్ కోసం రిఫర్ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు, అవసరమైన వారికి ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు ఇలాంటి శిబిరాలను నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ సితలె రమేష్, సెక్రటరీ గాండ్ల సాయి కృష్ణ, లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు మేకల విఠల్, సభ్యులు మేరూ భరత్ తదితరులతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లో చేరిన నాయకులకు ఘన సన్మానం

**బీర్కూర్, జూలై 21 (జన సంఘర్షణ):**



కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలోని బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన వివిధ పార్టీల నాయకులు సోమవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన వడ్ల బస్వరాజు, కుర్రి కృష్ణ, చామకూర రాజులను మంగళవారం బీర్కూర్ మండల బీఆర్ఎస్ నాయకులు, గ్రామ సర్పంచ్ ఆరిగే ధర్మతేజ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నూతన చేరికలతో బీర్కూర్ మండలంలో బీఆర్ఎస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి సర్పంచ్‌ల శిక్షణ పూర్తి చేసిన శ్వేత సూర్యకాంత్‌కు ఘన సన్మానం

**కోటగిరి/జూలై 21 (జన సంఘర్షణ):** హైదరాబాద్‌లో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి మహిళా సర్పంచ్‌ల శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న ఎత్తోండ గ్రామ సర్పంచ్ శ్వేత సూర్యకాంత్ను ఎత్తోండ గ్రామ పంచాయతీ పాలకవర్గం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా



సర్పంచ్ శ్వేత సూర్యకాంత్‌కు పూలమాల వేసి, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమానికి ఎంపికై, విజయవంతంగా పూర్తి చేసుకోవడం ఎత్తోండ గ్రామానికి గర్వకారణమని పేర్కొన్నారు. శిక్షణలో పొందిన జ్ఞానం, అనుభవంతో గ్రామాభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ నవీన్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు షేక్ మస్తాన్, శ్రీనివాస్, జల్లయ్య, గోపి, రమేష్, గ్రామ పెద్దలు దశరథ్, లాలు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొని సర్పంచ్ శ్వేత సూర్యకాంత్‌కు అభినందనలు తెలిపారు.

# పండుగ వైభవం ప్రతిబింబించేలా ఆకట్టుకునే విధంగా సవరించాను

❑ కొడిచెర్లలో ఘనంగా బోనాల పండుగ.. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

**పోతంగల్, జూలై 21 (జన సంఘర్షణ):**



పోతంగల్ మండలంలోని కొడిచెర్ల గ్రామంలో బోనాల పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, యువత, చిన్నారులు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొని గ్రామ దేవతలకు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పండుగ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తుల సందడితో కొడిచెర్ల గ్రామం పండుగ శోభను సంతరించుకుంది. గ్రామస్తులంతా ఐక్యంగా పాల్గొని బోనాల పండుగను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గ్రామం సుభిక్షంగా అభివృద్ధి చెందాలని గ్రామ దేవతలను వేడుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి సర్పంచ్ శిక్షణ పూర్తి చేసుకున్న శ్వేత సూర్యకాంత్‌కు ఘన సన్మానం



**కోటగిరి, జూలై 21 (జన సంఘర్షణ):** హైదరాబాద్‌లో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి సర్పంచ్‌ల శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న ఎత్తోండ గ్రామ సర్పంచ్ శ్వేత సూర్యకాంత్‌ను కోటగిరి సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సర్పంచ్ బర్ల మధుకర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్వేత సూర్యకాంత్‌ను పూలమాలలు, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమానికి ఎంపికై, విజయవంతంగా పూర్తి చేసుకోవడం ఎత్తోండ గ్రామానికి, కోటగిరి మండలానికి గర్వకారణమని వారు పేర్కొన్నారు. శిక్షణలో పొందిన జ్ఞానాన్ని గ్రామాభివృద్ధికి వినియోగిస్తూ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం ప్రతినిధులు, గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు పాల్గొని శ్వేత సూర్యకాంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

జన సంఘర్షణ
తెలుగు దినపత్రిక
బుధవారం
22 జులై 2026

# ఉద్యమకారులకు న్యాయం చేయడంలో జాప్యం వద్దు

- కల్వకుంట్ల కవిత
- కేకే కమిటీ అంటే కాలయాపన కమిటీ అనే భావనను తొలగించాలి..
- కాలపరిమితిలో ఉద్యమకారులను గుర్తించి న్యాయం చేయాలి

మద్నూర్, జూలై 21 (జన సంఘర్షణ): తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, వారికి తగిన గౌరవం, సంక్షేమ ప్రయోజనాలు అందించేందుకు ఏర్పాటు చేసిన గుర్తింపు కమిటీకి తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తన సూచనలు, సలహాలతో కూడిన నివేదికను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉద్యమకారులకు న్యాయం చేసే విషయంలో ఎలాంటి జాప్యం చేయకుండా, నిర్ణీత కాలపరిమితిలో గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం తమను ఆహ్వానించి సూచనలు, సలహాలు కోరిన కమిటీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యమకారులకు తన సూచనల ద్వారా కొంతైనా మేలు జరిగితే తన జన్మ ధన్యమైనట్లేనని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారులతో కలిసి భుజం భుజం కలిపి పోరాటం చేసిన వ్యక్తిగా, గత ప్రభుత్వ హయాంలో ఉద్యమకారులకు జరిగిన అన్యాయంపై అంతర్గత వేదికల్లో ప్రశ్నించి వారి కోసం పోరాడానని పేర్కొన్నారు.



**స్వాతంత్ర్య సమరయోధుల పథకాలను అధ్యయనం చేయాలి....**

స్వతంత్రత సైనిక్ సమ్మాన్ యోజన, హైదరాబాద్ లిబరేషన్ మూమెంట్‌కు సంబంధించిన నిబంధనలు, మార్గదర్శకాలను కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయాలని కవిత సూచించారు. ఆయా నిబంధనల్లో ఉన్న విధంగా తెలంగాణ ఉద్యమకారులకు కూడా ప్రయోజనాలు కల్పించే అవకాశాలను పరిశీలించాలని కోరారు. స్వాతంత్ర్య ఉద్యమంలో లక్షలాది మందికి గుర్తింపు లభించినప్పటికీ, ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరి సేవలను గుర్తించే విధంగా విస్తృత దృక్పథంతో వ్యవహరించారని గుర్తుచేశారు. అదేవిధంగా హైదరాబాద్ లిబరేషన్ మూమెంట్‌కు సంబంధించిన నిబంధనలను కూడా పరిశీలించి, 1969 తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు న్యాయం చేసే విధంగా విధివిధానాలను రూపొందించాలని సూచించారు. తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన వివిధ సంఘాలు, సంస్థల సిఫార్సులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

**ఉద్యమంలో జైలు, కేసులు, పోలీసు నిర్బంధం ఎదుర్కొన్న వారికి ప్రాధాన్యం...**

తెలంగాణ ఉద్యమ సమయంలో జైలుకు వెళ్లినవారు, ఎఫ్ఐఆర్‌లు, చార్జిషీట్లు ఎదుర్కొన్నవారిని గుర్తింపు విషయంలో ముందుగా పరిగణనలోకి తీసుకోవాలని కవిత అన్నారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రత్యేక వెసులుబాటు కల్పించే అంశాన్ని కూడా పరిశీలించాలని సూచించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో అండర్‌గ్రౌండ్‌లో ఉన్నవారు, హౌస్ అరెస్ట్‌కు గురైనవారిని కూడా పరిగణనలోకి తీసుకున్న విధానాలను అధ్యయనం చేయాలన్నారు. ఉద్యమ సమయంలో ఆస్తి నష్టం, శారీరక వైకల్యం, పోలీసుల వేధింపులు, లాఠీ దెబ్బలు ఎదుర్కొన్న వారిని మానవతా దృక్పథంతో త్వరగా గుర్తించాలని కోరారు. రాజేష్ నాయక్, యాకూబ్ రెడ్డి వంటి ఉద్యమకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, అలాంటి వారి త్యాగాలను గుర్తించి తగిన గౌరవం ఇవ్వాలని అన్నారు.

**ఉద్యమం కారణంగా ఉద్యోగాలు, జీవనోపాధి కోల్పోయిన వారికీ న్యాయం చేయాలి..**

తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కారణంగా ఉద్యోగాలు కోల్పోయినవారికి, ఇబ్బందులు ఎదుర్కొన్న ఉపాధ్యాయులు, ఉద్యోగులకు కూడా న్యాయం చేయాలని కవిత కోరారు. కొన్ని ప్రాంతాల్లో ఉద్యమకారుల డీలర్‌షిప్‌లు రద్దు చేయబడిన సందర్భాలను కూడా పరిశీలించి, బాధితులకు తగిన పరిహారం లేదా న్యాయం చేసే మార్గాలను అన్వేషించాలని సూచించారు. ఉద్యమకారులు మరణించిన సందర్భంలో వారి భార్యకు, ఆమె లేని పక్షంలో పిల్లలకు, తల్లిదండ్రులకు ప్రాధాన్యత కల్పించే విధంగా సంక్షేమ పథకాలను రూపొందించాలని అన్నారు. ఎలాంటి పథకాలు అమలు చేసినా అక్రమాలకు, అవకతవకలకు తావులేకుండా పారదర్శకమైన విధానాన్ని రూపొందించాలని సూచించారు.

**ఉద్యమకారుల వివరాల సేకరణకు విస్తృత విధానం అవసరం...**

ఉద్యమకారుల గుర్తింపు కోసం కేవలం కొందరి సిఫార్సులపైనే ఆధారపడకుండా, ఉద్యమంలో పాల్గొన్న సహచరులు, వివిధ ప్రజా సంఘాలు, విద్యావంతుల వేదికలు, ఉద్యమ సంస్థల నుంచి కూడా వివరాలను సేకరించాలని కవిత సూచించారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమ సమయంలో పనిచేసిన వేలాది మంది ఉద్యమకారుల వివరాలు తమ వద్ద ఉన్నాయని, కమిటీ అనుమతిస్తే పూర్తి సమాచారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

**కాలయాపనకు తావులేకుండా కాలపరిమితిలో గుర్తింపు ఇవ్వాలి**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 30 నెలలకు ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఏర్పాటు చేయడం ఆలస్యమైందని కవిత విమర్శించారు. ఉద్యమకారులు ఆందోళనలు, నిరసనలు చేసిన అనంతరం కమిటీ ఏర్పాటు చేయడం బాధాకరమన్నారు. అయితే కమిటీ ఏర్పాటు చేసినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ, ఇకనైనా వేగంగా నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. కేకే కమిటీ అంటే కాలయాపన కమిటీ అనే భావన ప్రజల్లో ఉందని, ఆ అపోహను తొలగించేలా కమిటీ పనిచేయాలని అన్నారు. నిర్ణీత కాలపరిమితిలో ఉద్యమకారులను గుర్తించి, వారికి ఏ విధంగా ప్రయోజనాలు అందిస్తారో స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎప్పుడు నిర్ణయం తీసుకున్నా, అధికారంలోకి వచ్చిన తేదీ నుంచే ఉద్యమకారులకు ప్రయోజనాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ఇతర రాష్ట్రాల విధానాలను అధ్యయనం చేయాలి....**

జార్ఖండ్‌లో ఉద్యమకారులు, వారి కుటుంబాలకు అందుతున్న ప్రయోజనాలను అధ్యయనం చేయాలని కవిత సూచించారు. ఉద్యమకారుల పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్న విధానాలను కూడా పరిశీలించాలని కోరారు. అలాగే ఇతర రాష్ట్రాల్లో ఉద్యమకారులకు అందిస్తున్న పెన్షన్లు, సంక్షేమ పథకాలు, గుర్తింపు కార్డుల విధానాలను అధ్యయనం చేసి తెలంగాణలోనూ అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని అన్నారు. ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు అందించి వారిని గౌరవించాలని, వారి త్యాగాలను అధికారికంగా గుర్తించే విధంగా శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని కవిత సూచించారు.

**ఉద్యమకారులకు న్యాయం చేయడమే కమిటీకి నిజమైన నివాళి**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులు, అమరవీరులకు ముందుగా చేతులెత్తి నమస్కరిస్తున్నానని కవిత అన్నారు. ఉద్యమ సమయంలో ఉన్న భావోద్వేగాలను స్పష్టమైన ప్రభుత్వ నిబంధనలు, ఉత్తర్వుల రూపంలోకి తీసుకురావాల్సిన బాధ్యత కమిటీపై ఉందన్నారు. అవసరమైన నిబంధనలు, ఉత్తర్వులు కేంద్ర ప్రభుత్వ స్థాయిలోనూ సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. ఉద్యమకారుల సంఖ్య పెరుగుతుందనే కారణంతో గుర్తింపు ప్రక్రియను ఆలస్యం చేయకుండా, విశాల హృదయంతో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని ఆమె కోరారు. తెలంగాణ ఉద్యమంలో త్యాగాలు చేసిన ప్రతి ఒక్కరి సేవలను గౌరవించి, వారికి న్యాయం జరిగేలా నిర్ణయాలు తీసుకోవడమే కమిటీకి, ప్రభుత్వానికి నిజమైన బాధ్యత అని కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా అధ్యక్షులు సంపత్ గౌడ్, జిల్లా యూత్ అధ్యక్షులు ఆదిల్, ఉపాధ్యక్షులు మిరేవర్ సాయిలు, జుక్కల్ ఇంచార్జ్ రాజశేఖర్, మద్నూర్ మండల నాయకులు బండి వార్ హనుమాన్లు తదితరులు పాల్గొన్నారు.

# నాసిరకంగా రహదారి పనులు..

- రోడ్డు పూర్తికాకముందే పగుళ్లు.. గుంతలు
- ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌పై ఆరోపణలు.. అధికారుల పర్యవేక్షణ ఏదీ?

రుద్రూర్,/ జూలై 21/(జన సంఘర్షణ) రుద్రూర్ మండల కేంద్రంలో చేపడుతున్న రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు గాలికొదిలేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జవహర్‌నగర్ కాలనీ సమీపంలో నూతనంగా చేపట్టిన జాతీయ రహదారి పనులు పూర్తికాకముందే రహదారిపై పగుళ్లు ఏర్పడి ఒక్కసారిగా పెద్ద గుంత ఏర్పడటంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సౌకర్యం కోసం కోట్లాది రూపాయలతో చేపడుతున్న రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నాణ్యత లేని మెటీరియల్ వినియోగం, సరైన ప్రమాణాలు పాటించకపోవడం, అధికారుల పర్యవేక్షణ లోపించడం వంటి కారణాలతోనే రోడ్డు నిర్మాణం పూర్తికాకముందే దెబ్బతిన్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఏర్పడిన భారీ గుంత కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో ఈ గుంత ప్రమాదాలకు కారణమయ్యే ప్రమాదం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాసిరకం పనులతో ప్రజాధనం వృథా చేయడమే కాకుండా ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే పరిస్థితి ఏర్పడిందని మండల ప్రజలు మండిపడుతున్నారు. రోడ్డు పనులు పూర్తికాకముందే పగుళ్లు, గుంతలు ఏర్పడితే పనుల నాణ్యతపై అధికారుల పర్యవేక్షణ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రహదారి నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి,



నాణ్యతా ప్రమాణాలను తనిఖీ చేయాలని, లోపాలు తేలితే బాధ్యులైన కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా దెబ్బతిన్న రహదారిని వెంటనే మరమ్మతులు చేసి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన పర్యవేక్షణ చేపట్టాలని కోరుతున్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, జూలై 21, (జన సంఘర్షణ): ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్, దిల్కుష్ నగర్ లో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై బి యల్ ఓ లను అడిగి తీసుకోవడంతో పాటు, వారికి తగు సూచనలు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసన్న కుమార్,మేడ్చల్ డిస్ట్రిక్ట్ ఫిషేర్మన్ కమిటీ వైస్ చైర్మన్ బాలానగర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఆకుల నరేందర్ ముదిరాజ్, యస్ సి సెల్ కో - ఆర్డినేటర్ జిల్లా శివకుమార్, దిల్కుష్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ ముజీబ్, జాయింట్ సెక్రటరీ ఎండీ .ముక్తార్ అహ్మద్,మాజీ అధ్యక్షుడు కారీముల్లా , మహబూబ్ అలీ, మునావర్ భాయ్, సాజిద్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# తాళం వేసిన ఇంట్లో చోరీ..

- బంగారం, వెండి, నగదు అపహరణ

బాన్సువాడ ఆర్ సి ప్రతినిధి/జూలై 21/(జన సంఘర్షణ) పట్టణంలోని బీడీ వర్కర్స్ కాలనీలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. బాధితురాలు మోత్కూరి విమల (కండక్టర్) తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 18న దుర్కి గ్రామంలో బంధువులు మృతి చెందడంతో ఇంటికి తాళం వేసి అక్కడికి వెళ్లారు. కాగా సోమవారం ఉదయం పక్కింటి వారు ఫోన్ చేసి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని సమాచారం అందించారు. దీంతో వెంటనే ఇంటికి చేరుకున్న విమల స్థానికులతో కలిసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు. ఇంట్లో నుంచి ఒక తులం బంగారం, 12 తులాల వెండి, రూ. 10 వేల నగదు అపహరణకు గురైనట్లు బాధితురాలు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# వర్షాభావ పరిస్థితుల్లో పంటల మార్పిడిపై దృష్టి సారించాలి

- యోగితారాణా
- ప్రత్యామ్నాయ పంటల సాగుతో రైతులకు మేలు.. ప్రభుత్వ చర్యలు విస్తృతం

నిజామాబాద్, జూలై 21 (జన సంఘర్షణ):



వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నీటి లభ్యత తగ్గుతున్న ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల మార్పిడిపై దృష్టి సారించాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా సూచించారు. రైతులు పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకొని సాగు చేపట్టడం ద్వారా నీటి కొరతను అధిగమించడంతో పాటు వ్యవసాయంలో నష్టాలను తగ్గించుకోవచ్చని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ కార్యాచరణను అమలు చేసేందుకు ప్రభుత్వం అన్ని జిల్లాల్లో విస్తృత చర్యలు చేపడుతోందని తెలిపారు. రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తూ పంటల ఎంపికపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఆదర్శ రైతులు ప్రతికూల పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనే సామర్థ్యం కలిగి ఉన్నారని యోగితారాణా పేర్కొన్నారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బాన్సువాడలో ఇంటింటి ఆరోగ్య సర్వేపై అవగాహన సదస్సు

బాన్సువాడ/జూలై 21/(జనసంఘర్షణ) బాన్సువాడ ఏరియా ఆసుపత్రిలో ఇంటింటికి జరిగే ఆరోగ్య సర్వే కొరకు సిబ్బందితో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట్ మాట్లాడుతూ.. బాన్సువాడ పట్టణం లో గురువారం నుండి ఆరు రోజుల పాటు నిర్వహించే ఇంటింటి సర్వే రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖ ఆదేశానుసారం నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేలో మా సిబ్బంది ప్రతి ఇంటికి వచ్చి ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలు తెల్సుకొని నమోదుచేస్తారు. వారు అడిగే సమాచారం తో పాటు ఆధార్ కార్డు ఇవ్వాలని జిల్లా అధికారి కోరారు. తద్వారా ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలు అభకార్డు లో నమోదై ఉంటాయి. భవిష్యత్తులో ఆరోగ్య పరంగా ఎంతో ఉపయోగ పడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరెండెంట్ డాక్టర్ విజయ్ భాస్కర్,సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తూ విద్వేషాలను రెచ్చగొట్టడం సబబు కాదు

- కార్తీక్ యాదవ్

రెంజల్/జూలై 21/ (జనసంఘర్షణ) రెంజల్ పోలీస్ స్టేషన్ లో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై ఇతర నాయకులపై బోధన్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేయడం జరిగింది..పై పేర్కొన్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులకు ఫిర్యాదులో పేరుకోవడం జరిగింది... ఈ సందర్భంగా కార్తీక్ యాదవ్ మాట్లాడుతూ ఈ నెల 18న బి ఆర్ ఎస్ నిర్వహించిన యువ సంగ్రామ సభలో ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తూ విద్వేషాలను రెచ్చగొట్టడం సబబు కాదు కేటిఆర్ దగ్గర ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయించడం హేయమైన చర్య అని అన్నారు... యూత్ కాంగ్రెస్ తలుచుకుంటే బారీస్ నాయకులు బయట తిరగలేరు అని హెచ్చరించారు...యువతకు కూడా బిఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మి తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు అని ఇది ప్రజాప్రభుత్వం ఇక్కడ ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుంది అని అన్నారు... ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ అబ్బోల్ల శ్రీకాంత్, అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సాయినాథ్ యాదవ్, యూత్ కాంగ్రెస్ నాయకులు సురేష్, శ్రీకాంత్, సుశాంత్, చింటూ సీనియర్ నాయకులు నిరాడి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



## అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ నేతలపై చర్యలు తీసుకోవాలి

- చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు, రాస్తారోకోలు చేపడతాం: కాంగ్రెస్ నాయకులు

మద్నూర్/ జూలై 21 (జన సంఘర్షణ):




తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై ఎల్‌బీనగర్‌లో జరిగిన యువ సదస్సులో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలకు బాధ్యులైన వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆదేశాల మేరకు మంగళవారం తాడ్వాయి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై మోహన్ రెడ్డికి కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు (కంప్లైంట్) అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు చేయడం సహజమే అయినప్పటికీ, వ్యక్తిగతంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. తమ ఫిర్యాదుపై తగిన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్‌లో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు, రాస్తారోకోలు చేపడతామని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు హన్మంత్ యాదవ్, మద్నూర్ మండల అధ్యక్షుడు హన్మంత్ యాదవ్, మండల వైస్ ప్రెసిడెంట్ అభిషేక్ పటేల్, కామారెడ్డి జిల్లా జనరల్ సెక్రెటరీ ఉప్పల అభిషేక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్, విలేజ్ ప్రెసిడెంట్ సంజు తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బోధన్‌లో భక్తిశ్రద్ధలతో ప్రారంభమైన 72 గంటల అఖండ రుద్రాభిషేక మహోత్సవం

బోధన్/జూలై 21 /(జనసంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని బ్రాహ్మణ గల్లిలో గల దక్షిణముఖి ఆంజనేయ స్వామి దేవాలయంలో 72 గంటల అఖండ రుద్రాభిషేక మహోత్సవం భక్తిశ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా ప్రారంభమైంది. సోమవారం ప్రారంభమైన ఈ ఆధ్యాత్మిక మహోత్సవంలో ఉదయం నుంచే ప్రత్యేక అభిషేకాలు, రుద్రపారాయణం, మహామంగళహారతులు, విశేష పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయ ప్రాంగణమంతా "ఓం నమఃశివాయ" నామస్మరణతో, వేద మంత్రోచ్ఛారణలతో మారుమోగుతూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఆలయానికి తరలివచ్చిన భక్తులు భక్తి పారవశ్యంతో పూజల్లో పాల్గొని స్వామివారికి ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. రాష్ట్రంలో, దేశంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, రైతులు, ప్రజలు పాడి పంటలతో సుఖసంతోషాలతో ఉండాలని సంకల్పిస్తూ బోధన్ బ్రాహ్మణ సేవా సమాజ్, వీడీసీ పట్టణ అభివృద్ధి కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు ఈ కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగనున్నాయి. ఈ మహోత్సవ ఏర్పాట్లను వీడీసీ పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గంగాధర్ రావు పట్వారి, ప్రధాన కార్యదర్శి బీర్కూర్ బుజ్జి శంకర్, కోశాధికారి శ్రీను, బ్రాహ్మణ సేవా సమాజ్ అధ్యక్షులు ప్రవీణ్ మహారాజ్,గౌరవ అధ్యక్షులు వినోద్ పట్వారి, ప్రధాన కార్యదర్శి ఉమానందు వైద్యతో పాటు కార్యవర్గ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. ఈ పవిత్ర అఖండ రుద్రాభిషేక మహోత్సవంలో పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని నిర్వాహకులు భక్తులకు పిలుపునిచ్చారు.

## కోయ, గోండి భాషా దినోత్సవం

- ఘనంగా నిర్వహించిన ఆదివాసీ జేఏసీ నాయకులు
- జె ఏ సీ చైర్మన్ వాసం ముసలయ్య

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, జులై 21(జనసంఘర్షణ):



ఆదివాసుల ఉచ్చారణ, బాషాదినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న విశ్వ కోయ,గోండి భాషా దినోత్సవంను పురస్కరించుకొని చర్ల మండలంలో ఆదివాసీ జేఏసీ నాయకులు, సామాజిక కార్యకర్తలు కలిసి భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కోయ,గోండి భాషలు ఆదివాసీల సంస్కృతి, చరిత్ర, ఆత్మగౌరవానికి ప్రతీకలని అన్నారు. మాతృభాషను కాపాడుకోవడం ప్రతి ఆదివాసి బాధ్యత అని, భావితరాలకు కోయ,గోండి భాషను అందించేందుకు ప్రతి కుటుంబం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు కోయ,గోండి భాషల పరిరక్షణ, అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టి, పాఠశాలల్లో మాతృభాషలో బోధనకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆదివాసీ భాషలకు తగిన గుర్తింపు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోచర్ల మండలం ఆదివాసీ జేఏసీ చైర్మన్ వాసం ముసలయ్య, నూగురు మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్ప శ్రీనివాసరావు, ఇరప రాజు దొర, పూనెం వరప్రసాద్,ఆదివాసీ మహిళా జేఏసీ ఇరప ప్రకాష్ దొర, ఇరప అపర్ణ, బీరబోయిన రాణి, కోరం బిక్షపతి,తాటి వెంకటరావు, బీరబోయిన శేఖర్, కలం. శ్రీను, సరేం హరిదీప్, మడప అనిల్ ఆదివాసీ జేఏసీ నాయకులు, యువజన ప్రతినిధులు, మహిళా నాయకులు, కోయ-గోండి భాషాభిమానులు, పలువురు ఆదివాసీ ప్రజలు పాల్గొన్నారు.

## వానవాసి కల్యాణపరిషత్ బాలికలు ఉన్నత విద్యవంతులు కావాలి

- వనవాసీ స్థలదాత జవ్వాది రాంబాబు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,చర్ల మండలం,, జూలై 21 (జనసంఘర్షణ):



వానవాసి కల్యాణపరిషత్ బాలికలు, విద్యార్థునులు పట్టుదలతో చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని వనవాసీ కళ్యాణ పరిషత్ శబరి బాలికల నిలయ స్థలదాత గుంటూరు వాసి జవ్వాది కోదండ రాంబాబు అన్నారు. కోదండ రాంబాబు, సుమతి రామ్ దంపతుల వివాహ వార్షికోత్సవంను పురస్కరించుకొని వనవాసీ కల్యాణపరిషత్ కొమరం భీం, శబరి బాలికల విద్యార్థిని నిలయంకు 50 కేజీల బియ్యంతో పాటు విద్యార్థులకు భోజనం, పండ్లు, స్వీట్స్ ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా నిలయ కార్యదర్శి వానవాసి కల్యాణపరిషత్, జవ్వాది మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోదండ రాంబాబు, సుమతి రామ్ లు మాట్లాడారు. విద్యార్థులు ఇతర వ్యాపకాలపై దృష్టి సారించకుండా చదువుల పైనే శ్రద్ధ వహించాలని విజ్ఞప్తి చేసారు. చదువుకుంటే మంచి ఉన్నత భవిష్యత్ ఉంటుందని, చదువుకొని ఉన్నత ఉద్యోగం సాదించిన వారు ఉన్నత స్థితిలో ఉన్నారని, ఇటువంటి వారిని ఆదర్శంగా తీసుకొని జీవితాన్ని సుస్థిరం చేసుకోవాలని సూచించారు. వనవాసీ కళ్యాణ పరిషత్ సంస్థ స్థాపన గిరిజన విద్యార్థుల అభ్యున్నతి కొరకే ఉన్నదన్న విషయాన్ని గమనంలోకి తీసుకొని క్రమ శిక్షణతో మెలగి సంస్థకు పేరు ప్రతిష్టతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రములోనే మొట్టమొదటి సారిగా చర్లలో శబరి పేరిట బాలికల నిలయం ఏర్పాటు చేయడం హర్షనీయమని పేర్కొన్నారు. విద్యార్థులకు దాతల సహకారం సైతం మరువలేనిదని అన్నారు. సంస్థకు ప్రభుత్వాల నుండి ఎటువంటి ఆదాయం సమకూరదని, కేవలం దాతల సహకారంతోనే నిర్వహిస్తున్నామని, ఈ విషయాన్ని గమనంలోకి తీసుకుని దాతలు సహకార మందించడం శుభపరినామమని పేర్కొన్నారు. విద్యార్థులు దాతల నమ్మకానికి అనుగుణంగా విద్య నభ్యసించి జీవితంలో స్థిరపడాలని విజ్ఞప్తి చేసారు. కార్యక్రమంలో వనవాసీ ప్రాంత మహిళా సహ ప్రముఖ్ పెద్దాడ ఆశాలత, జిల్లా సంఘటనా కార్యదర్శి కోరం సూర్యనారాయణ, జిల్లా సహ కార్యదర్శి గోగికార్ రాంలక్ష్మణ్, కొమరం భీం విద్యార్థి నిలయం అధ్యక్షుడు తాటి పాపారావు, ఉప కోశాదికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, జవ్వాది శ్రీకాంత్, జవ్వాది శ్రీనివాస్, లవన్ కుమార్ రెడ్డి, కొమరం భీం నిలయ ప్రముఖ్ సాంబయ్య, శబరి బాలికల నిలయ ప్రముఖ్ వరలక్ష్మి పాల్గొన్నారు.

## ఈ నెల 18న సరూర్ నగర్ లో సీఎం, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై దూషణ పూరిత బెదిరింపులు

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 21 (జన సంఘర్షణ)



ఈనెల జూలై 18న సరూర్నగర్ లో జరిగిన "యువ సంగ్రామ.' సభలో గౌరవనీయులైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై దూషణ పూరిత బెదిరింపులు, అగౌరవకమైన భాషను ఉపయోగించిన వ్యక్తులపైన చర్యలు తీసుకోవాలని ఈరోజు మెదక్ జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కమ్మరి రమేష్ చారి ఆధ్వర్యంలో మెదక్ టౌన్ సిఐకి ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ చారి మాట్లాడుతూ.. ఇలాంటి వ్యాఖ్యలను యూత్ కాంగ్రెస్ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిఐ కి విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో హవేలీ ఘనపూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రిజ్వాన్, మహేష్, భాను తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ ధాన్యం మాయం

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 21 (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా లోని కొల్చారం మండల కేంద్ర ములో శ్రీ సత్య సాయి ఆగ్రో రైస్ మిల్ ఇండస్ట్రీస్ లోసుమారుగా ఏడు కోట్ల రూపాయల ధాన్యం మాయమైనట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద తెలిపారు. కూల్చారం మండలంలోని రైస్ మిల్లు లో ఖరీఫ్ రబీ సీజన్‌లో వచ్చిన ధాన్యం మాయం అయ్యానట్లు సమాచారం రావడంతో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ జిల్లా పౌర సరఫరల అధికారి, అసిస్టెంట్ పౌర సరఫరల అధికారి, ఇన్స్పెక్టర్ (సివిల్ సప్లై) వారు సంయుక్తంగా కలిసి మెదక్ జిల్లా లోని కొల్చారం మండలం ఒ గ్రామంలో గల శ్రీ సత్య సాయి ఆగ్రో రైస్ మిల్ ఇండస్ట్రీస్ లో తనిఖీలు చేశారు. ఈ తనిఖిలలో ఖరిఫ్ (2025-26) సీజన్‌కి సంబదించిన 3029.960 మెట్రిక్ టన్నుల ధాన్యం (75, 749 బ్యాగులు) తక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తక్కువగా ఉన్న 3029.960 మెట్రిక్ టన్నుల ధాన్యం విలువ 7,17,79,752.40/-. తదుపరి సదరు రైస్ మిల్ యజమాని అయిన ఐ. శ్రీనివాస్ పై ఈఈ యాక్ట్ -1955 కింద 6-ఏ కేసు నమోదు చేసి, తదుపరి చర్యల కొరకు మెదక్ జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించడం జరిగిందన్నారు.

## అధిక రుసుము వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవు

- ఈ - డిస్ట్రిక్ట్ మేనేజర్ సందీప్.
- తప్పుగా డాక్యుమెంట్స్ అప్లోడ్ చేస్తే చర్యలు తప్పవు.
- ఇకపై మీ సేవలో డిజిటల్ రశీదులు.
- మెదక్ జిల్లా పరిదిలోని పలు మీసేవ కేంద్రాలను ఈ -డిస్ట్రిక్ట్ మేనేజర్ సందీప్ ఆకస్మిక తనిఖీ చేశారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 21(జన సంఘర్షణ)

కొత్తగా వచ్చిన ఎస్ ఎస్ సి మేమో ప్రింట్, యూరియా బుకింగ్, ఫార్మర్ రిజిస్ట్రేషన్, వ్యవసాయేతర మార్కెట్ విలువ సర్వీసుల గురించి మీసేవ నిర్వాహకులకు వివరించారు. ఏ విధమైన టెక్నికల్ సమస్యలు వచ్చిన అతి త్వరగా క్లియర్ చేస్తామని ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ప్రతి అప్లికేషన్ నమోదు చేయాలని తెలిపారు. కులం, ఆదాయం, నివాసం, జనన , మరణ కుటుంబ దృవీకరణ పత్రం, నేటివిటి, గ్యాప్, నాన్ క్రిమీ లేయర్ వంటి సర్టిఫికేట్లు ఎన్ని సార్లు అయినా తీసుకునే వెసులుబాటు కలదని ఈ - డిస్ట్రిక్ట్ మేనేజర్ సందీప్ తెలిపారు మీసేవ కేంద్రాలను ప్రజలకు ఇప్పుడు అందుబాటులో ఉండి గైడ్లైన్స్ ప్రకారం మీ సేవ కేంద్రాన్ని నడపవలనని సూచించారు. ఆపరేటర్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి అన్ని రకాల మీసేవ, భూభారతి మరియు మిగతా ఆన్లైన్ సర్వీస్ లను ప్రజలకు అందించాలని సూచించారు. మీసేవ సెంటర్లో తప్పకుండా సిటిజెన్ చాప్టర్, భూభారతి కి సంబంధించిన ఫ్లెక్సీలు, మీసేవ లోగో, మరియు తాసిల్దార్, ఈడీఎం, పరిష్కారం కాల్ సెంటర్ల యొక్క ఫోన్ నెంబర్లు తప్పనిసరిగా ఉండవలెనని ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆదేశించారు.కళ్యాణ లక్ష్మి, (సదరం), బర్త్, డెత్ సర్టిఫికెట్లు ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని, మీసేవ ఆపరేటర్లు ప్రజల పట్ల సున్నితంగా ఉంటూ వారికి మీసేవ సర్వీసులను, ఇతర అన్ని రకాల ఆన్లైన్ సేవలను అందించాలని ఆదేశించారు.నిర్ణీత రుసుము కంటే ఎక్కువ రుసుము దరఖాస్తుదారుడు నుంచి తీసుకున్నట్లయితే తప్పనిసరిగా అట్టి మీసేవ సెంటర్ పై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ తెలిపారు.



అదేవిదంగా రాష్ట్రంలో పౌర సేవలను పారదర్శకంగా వేగవంతంగా అందించేందుకు ప్రభుత్వం నూతన విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. గ్రామ పాలనాధికారులు, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు వినియోగించుకునే విధంగా ప్రత్యేక మొబైల్ అనువర్తనాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇకపై పౌర సేవల దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, రెవెన్యూ సిబ్బంది నివేదికల సమర్పణ తదితర ప్రక్రియ మొత్తం ఆన్లైన్ విధానంలోనే కొనసాగుతుంది . అని తెలిపారు.కాగిత రహిత విధానం అమలులోకి రావడంతో సమయానికి సేవలు అందడం, పారదర్శకత పెరగడం జరుగుతుందని ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ తెలిపారు. ప్రస్తుతం ఆదాయం, కులం, నివాసం, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం, లేట్ రిజిస్ట్రేషన్ బర్త్ మరియు డెత్, అగ్రికల్చరల్ మార్కెట్ వాల్యూ, గ్యాప్ సర్టిఫికెట్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. మీసేవ ద్వారా అప్లై చేస్తే దరఖాస్తు తొలుత గ్రామ రెవెన్యూ పాలనాధికారి(జీపీవో)కి లాగిన్‌లోకి వస్తుంది. ఆయన విచారణ తర్వాత మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్(ఎంఆర్ఐ)కి, తదనంతరం ఆర్ఐ నేరుగా తహసీల్దార్ లాగిన్‌కి చేరవేరుస్తారని ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ తెలిపారు. అలాగే కొత్త విధానం ప్రకారం మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే దరఖాస్తుదారుడికి రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్ కు ఒక ఎస్ఎంఎస్ వస్తుంది. అందులో అప్లికేషన్ నెంబర్ సర్వీసు పేరు చెల్లించిన ఫీజు వివరాలతో పాటు ఒక హైపర్ లింక్ ఉంటుంది. పౌరులు ఆ లింకు పై క్లిక్ చేసి తమ రసీదును ఎప్పుడైనా వీక్షించవచ్చు డౌన్లోడ్ చేసుకోవచ్చు లేదా ప్రింట్ తీసుకోవచ్చు సర్టిఫికెట్ చేతికి వచ్చేవరకు ఈ ఎస్ఎంఎస్ ను సురక్షితంగా ఉంచుకోవాలని ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ సూచించారు. దీనివల్ల కాగితాలు పోగొట్టుకునే భయం ఉండదు అలాగే మీసేవ అప్లికేషన్లో సదరు మెసేజ్ తిరిగి పంపించే సౌకర్యాన్ని కల్పించారని ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మీసేవ సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి

- సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి.
- పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి.
- జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాస రావు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 21:(జన సంఘర్షణ)

నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం వార్షిక తనిఖీల్లో భాగంగా నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఎస్పీ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం స్టేషన్ పరిసరాలను పరిశీలించి, వివిధ రికార్డులు, ఎఫ్ఐఆర్ రిజిస్టర్లు, క్రైమ్ రికార్డులు, కేసు డైరీలు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతిని పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, చట్టపరమైన నిబంధనల ప్రకారం కేసులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీట్‌బెల్ట్






వినియోగించకపోవడం వంటి కారణాలతో జరిగే ప్రమాదాలను అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. రాత్రి గస్తీ, పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేయాలని, నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్లు (వీపీఓలు) తమ పరిధిలోని గ్రామాల్లో సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీ మోసాలు, బ్యాంకింగ్ మోసాలు, ఫేక్ లింకుల ద్వారా జరిగే మోసాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణ, ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు విస్తృతంగా చేపట్టాలని ఎస్పీ సూచించారు. దుకాణాలు, వ్యాపార సముదాయాలు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా వ్యాపారులు, దుకాణ యజమానులకు అవగాహన కల్పించాలని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించడంతో పాటు నేరస్తులను గుర్తించేందుకు, నేరాల దర్యాప్తులో కీలక ఆధారాలను సేకరించేందుకు ఎంతగానోఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రజలు, వ్యాపారులు పోలీస్ శాఖకు సహకరించి సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, సీఐలు రంగా కృష్ణ, సందీప్ రెడ్డి, ఎస్ఐలు రంజిత్ రెడ్డి, జగన్మోహన్, కృష్ణయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సేవతో శిఖరాగ్రానికి డాక్టర్ కీర్తన యాదవ్‌కు జాతీయ గౌరవం

- భారత వైద్యుల సంఘం జాతీయ సామాజిక సేవా పురస్కారం అందుకున్న తెలంగాణ యువ వైద్యురాలు.

హైదరాబాద్ సిటీ, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, జూలై 21, (జన సంఘర్షణ):

వైద్య సేవలను ప్రజాసేవతో మేళవించి సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందిన తెలంగాణ యువ వైద్యురాలు డాక్టర్ ఎన్. కీర్తన యాదవ్ ప్రతిష్ఠాత్మక భారత వైద్యుల సంఘం (ఐఎంఏ) జాతీయ సామాజిక సేవా పురస్కారం అందుకొని రాష్ట్రానికి అరుదైన గౌరవాన్ని తీసుకొచ్చారు. చిన్న వయసులోనే దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ పురస్కారాన్ని అందుకోవడం ఆమె సేవలకు లభించిన విశిష్ట గౌరవంగా నిలిచింది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వందలాది నామినేషన్లను పరిశీలించిన అనంతరం, సామాజిక సేవలో విశేష కృషి చేసిన కేవలం 25 మంది వైద్యులను మాత్రమే ఈ జాతీయ పురస్కారానికి ఎంపిక చేశారు. ప్రతి రాష్ట్రం నుంచి ఒక్కో వైద్యుడికి మాత్రమే అవకాశం లభించగా, తెలంగాణ నుంచి డాక్టర్ కీర్తన యాదవ్ ఎంపిక కావడం రాష్ట్ర వైద్య రంగానికి గర్వకారణంగా




నిలిచింది. న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో జరిగిన జాతీయ పురస్కార ప్రదానోత్సవంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా ఆమె ఈ గౌరవాన్ని అందుకున్నారు. దేశ నలుమూలల నుంచి ఎంపికైన ప్రముఖ వైద్యుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ కీర్తన యాదవ్ సేవలను భారత వైద్యుల సంఘం ప్రత్యేకంగా ప్రశంసించింది. ప్రస్తుతం ఉస్మానియా వైద్య కళాశాలలో మత్తుమందు వైద్య విభాగం (అనస్థీషియాలజీ)లో సహాయ ఆచార్యురాలిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కీర్తన యాదవ్, మరోవైపు డాక్టర్ నారి సేవా ట్రస్ట్ వ్యవస్థాపకురాలిగా అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు. ఉచిత వైద్య శిబిరాలు, ప్రాణరక్షణకు ఉపయోగపడే గుండె-శ్వాస పునరుద్ధరణ (సీపీఆర్) శిక్షణ, మహిళల ఆరోగ్య పరిరక్షణ, యువతలో ఆరోగ్య చైతన్యం, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు వైద్య సహాయం వంటి కార్యక్రమాల ద్వారా వేలాది మందికి చేరువయ్యారు. వైద్య సేవను ఆసుపత్రి గోడలకే పరిమితం చేయకుండా, సమాజంలో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న డాక్టర్ కీర్తన యాదవ్‌కు ఈ జాతీయ పురస్కారం దక్కడం ఆమె సేవలకు దేశస్థాయిలో లభించిన గుర్తింపుగా వైద్య రంగ ప్రముఖులు పేర్కొంటున్నారు. వైద్య వృత్తిలో నిబద్ధత, సామాజిక సేవలో అంకితభావం, ప్రజల పట్ల బాధ్యత కలిసివస్తే ఎంతటి ఉన్నత స్థాయికి చేరుకోవచ్చో డాక్టర్ కీర్తన యాదవ్ మరోసారి నిరూపించారు. ఆమె సాధించిన ఈ గౌరవం తెలంగాణకే కాకుండా యువ వైద్యులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని వైద్య, సామాజిక వర్గాలు అభినందిస్తున్నాయి.

## త్వరలో భూ పరిష్కరిస్తాం

- జిల్లా అదనపు ఎస్పీ.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 21 (జన సంఘర్షణ)



వివాదాస్పదం భూమిని పరిశీలించిన జిల్లా అదనపు ఎస్పీ విక్రమ్ సింగ్, రామాయంపేట సి ఐ సైద ఆధ్వర్యంలో 1288 సర్వే నంబర్ లోని పట్టా భూమిని పరిశీలించారు. ఈ భూమి రామాయంపేట పట్టణానికి చెందిన పోచమ్మ ల శ్రీనివాస్ కు చెందిన భూమి అంటూ పోలీస్ స్టేషన్లో ఇదే చేయగా మంగళవారం జిల్లా అదనపు ఎస్పి పరిశీలించారు. త్వరలో ఈ భూమిని పరిష్కరిస్తామని తెలిపారు.

## డబ్బులు పణంగా పెట్టి పేకాట.. 9 మంది అరెస్ట్

- రూ.6,630 నగదు, 9 సెల్‌ఫోన్లు, మోటార్‌సైకిళ్లు స్వాధీనం

పొతంగల్ /హంగర్గా ఫారం గ్రామం / జూలై 21 (జన సంఘర్షణ):



గ్రామంలో డబ్బులు పణంగా పెట్టి పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు కొరడా ఝుళిపించారు. పేకాట స్థావరంపై దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 6,630 నగదు, 9 సెల్‌ఫోన్లు, మోటార్‌సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, కోటగిరి ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, డబ్బులు పణంగా పెట్టి పేకాట ఆడుతూ కుటుంబాలను రోడ్డున పడేసుకోవద్దని సూచించారు. గ్రామాల్లో పేకాట, జూదం నిర్వహించే వారిపై కూడా నిఘా కొనసాగుతుందని, చట్టాన్ని ఉల్లంఘించి పేకాట ఆడినా, నిర్వహించినా ఉపేక్షించేది లేదని పోలీసులు స్పష్టం చేశారు.

## మానవతా దృక్పథంతో పాల సావిత్రి కుటుంబానికి అండగా నిలుద్దాం

కోటగిరి, /జూలై 21/(జన సంఘర్షణ)



కోటగిరికి చెందిన పాల సావిత్రి, కేజీబీవీ పాఠశాలలో సిబ్బందిగా పనిచేస్తున్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడి, ప్రస్తుతం ఆసుపత్రిలో కోమా స్థితిలో చికిత్స పొందుతున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

ఈ కష్ట సమయంలో మానవతా దృక్పథంతో స్పందించి, దాతృత్వ హృదయం కలిగిన ప్రతి ఒక్కరూ తమకు చేతనైనంత ఆర్థిక సహాయం అందించి పాల సావిత్రి కుటుంబానికి అండగా నిలవాలని మనస్ఫూర్తిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

“మన చేతి నుంచి అందించే చిన్న సహాయం… ఒక కుటుంబానికి కొండంత ధైర్యాన్ని, కొత్త ఆశను అందించగలదు.”

సహాయం పంపించడానికి ఫోన్ పే నెంబర్ 7569841880

పేరు: పాల పోశెట్టి

దయచేసి ఈ సహాయ విజ్ఞప్తిని మీ బంధువులు, స్నేహితులు, మిత్రులు, పరిచయస్తులకు ఎక్కువగా షేర్ చేసి, పాల సావిత్రి కుటుంబానికి అండగా నిలవండి.

**మీ చిన్న సహాయం… ఆమె కుటుంబానికి పెద్ద భరోసా!**

# మల్లికార్జున్ ఖర్గేకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు

హైదరాబాద్ సిటీ, శేరిలింగంపల్లి ప్రతినిధి అంజిబాబు, జూలై 21, (జన సంఘర్షణ):




దశాబ్దాలుగా ప్రజాసేవను ధ్యేయంగా చేసుకుని, సామాన్య ప్రజల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం,ప్రజాసేవకు అంకితభావంతో ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు నిరంతరం కృషి చేస్తున్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఒక భారతీయ రాజకీయ నాయకుడు, న్యాయవాదిగా 150 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన భారతదేశపు అత్యంత పురాతన జాతీయ పార్టీ భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా దేశానికి సేవలందిస్తున్న మల్లికార్జున్ ఖర్గే 84వ జన్మదిన శుభసందర్భంగా జన్మదిన వేడుకలను, నల్లగండ్ల గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు నియోజకవర్గంలోని సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలతో కలిసి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపటం జరిగింది. ఈ సందర్భంగా వి. జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.. మల్లికార్జున ఖర్గే రాజకీయ చరిత్రలో ఒక్క మహోన్నత వ్యక్తి. ఆయన రాజకీయ జీవిత చరిత్రలో 9 సార్లు ఎమ్మెల్యే, 2 సార్లు లోక్సభ ఎంపీ, 2 సార్లు రాజ్యసభ ఎంపీ, కాంగ్రెస్ లోక్సభ పక్ష నేత, రాజ్యసభ ప్రతిపక్ష నేతగా ఆయన తన రాజకీయ జీవితాన్ని రాష్ట్ర రాజకీయాల్లో ప్రారంభించారు. 1972 నుండి నేటి (2026)వరకు తన రాజకీయ అనుభవం, అంకితభావం, ప్రజాస్వామ్యంపై మీ నిబద్ధత దేశ రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన గొప్ప నాయకుడు, మల్లికార్జున ఖర్గే నిండునూరేళ్ళు, ఆయురారోగ్యాలు, ఆనందం,దీర్ఘాయుష్షు కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆల్విన్ కాలనీ 124 డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్వారీ శశిధర్ సీనియర్ నాయకులు, యువ నాయకులు, మహిళలు, యువకులు, టీం పట్వారీ తదితరులు పాల్గొన్నారు.

## వీలైనంత త్వరగా డ్రైనేజ్, మంచినీటి, శానిటేషన్ సమస్యలను పరిష్కరించాలి

- పాదయాత్ర చేసిన బిజెపి రాష్ట్ర నాయకులు.

హైదరాబాద్ సిటీ, శేరిలింగంపల్లి ప్రతినిధి అంజిబాబు, జూలై 21, (జన సంఘర్షణ):



శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఆల్విన్ కాలనీ డివిజన్ లో ప్రజా సమస్యలపై మంగళవారం రోజు ఎల్లమ్మబండ హనుమాన్ టెంపుల్ నుండి ఎన్టీఆర్ నగర్ కాలనీ, జయశంకర్ కాలనీ వరకు ఆల్విన్ కాలనీ డివిజన్ అధ్యక్షులు చిన్నగాలొల్ల రాజు ఆధ్వర్యంలో బిజెపి రాష్ట్ర నాయకులు రవీందర్ రావు, నరేందర్ రెడ్డి, కేశవరావు జిల్లా నాయకులు రామరాజు, మణి భూషణ్,స్థానిక నాయకులతో కలిసి పాదయాత్ర నిర్వహించి, ప్రజా సమస్యలు తెలుసుకోని మాజీ కార్పొరేటర్ సమస్యలు పరిష్కరించడంలో విఫలం అయ్యారని తెలుపుతూ సంబంధిత అధికారులతో, సిబ్బందితో ఫోన్‌లో మాట్లాడి వీలైనంత త్వరగా డ్రైనేజ్, మంచినీటి, శానిటేషన్ సమస్యలను పరిష్కరించాలని కోరడం జరిగింది.

## బాన్సువాడలో విద్యార్థుల భద్రతే లక్ష్యంగా ఆటోలు, మినీ క్యాబ్లపై ఆర్టీవో ప్రత్యేక తనిఖీలు

బాన్సువాడ/జూలై 21/





కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలో ఆటో రిక్షాలు, మినీ క్యాబ్లపై రవాణా శాఖ అధికారులు విస్తృత స్థాయిలో ప్రత్యేక తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా రవాణా అధికారి సంతోష్ కుమార్ ఆదేశాల మేరకు, ఆటోలు మరియు ఇతర వాహనాల ద్వారా ప్రయాణించే విద్యార్థుల భద్రతను ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని ఈ తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పలు వాహనాలను అధికారులు గుర్తించగా, సహాయక మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు రఫీ, ఉదయ్ వాటిని సీజ్ చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా అధికారి సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల భద్రత ప్రతి ఒక్కరి సామూహిక బాధ్యత అని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపే సమయంలో సురక్షితమైన, అనుమతులున్న వాహనాలలోనే ప్రయాణిస్తున్నారా అన్న విషయాన్ని తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. రహదారి భద్రతా నియమాలను కచ్చితంగా పాటిస్తూ రవాణా శాఖకుపూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరంగా కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

# ప్రజాస్వామ్యంలో నిరసన హక్కును అణిచివేసే విధంగా బీజేపీ కేంద్ర ప్రభుత్వం చేస్తుంది..





- పార్లమెంటరీ ప్రతిపక్ష నేత కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీని నిర్బంధించడం సిగ్గుచేటు...
- ప్రశ్నిస్తే అరెస్టా? ఇదేనా బీజేపీ ప్రభుత్వ ప్రజాస్వామ్యం?

ఢిల్లీ/జూలై 21/(జనసంఘర్షణ)

ఢిల్లీ వీధుల్లో విద్యార్థుల గొంతుగా నిలబడ్డ ప్రతిపక్ష నేతలను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి పెద్ద మచ్చ..! విద్యార్థుల కోసం గొంతెత్తిన మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ లతో సహా కాంగ్రెస్ అగ్రనేతల అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం..!! లక్షలాది విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకున్న నీట్ ప్రశ్నపత్ర లీకేజీపై సమాధానం చెప్పాల్సిన కేంద్ర ప్రభుత్వం, ప్రశ్నించే వాళ్ల నోరు మూయిస్తోంది..!! పార్లమెంట్ లో చర్చకు అవకాశం ఇవ్వరు. బయట నిరసన తెలిపినా అరెస్టు చేస్తారు. ఎందుకు ఈ భయం? ఈ వైఫల్యానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి..!! నీట్ లీకేజీపై పారదర్శకంగా చర్చ జరపాలి. నిజమైన నేరస్తులను శిక్షించాలి..!!మీ... గంధపు చిరుతదత్తు యువజన కాంగ్రెస్ బాన్సువాడ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ నాయకుడు పేర్కొన్నాడు.

# నిబంధనలకు విరుద్ధంగా ఉన్న సైలెన్సర్లను ధ్వంసం...

- హాజరైన జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్...

కోదాడ/జూలై 21/(జనసంఘర్షణ)

ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగించేలా నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాలకు అమర్చిన మోడిఫైడ్ సైలెన్సర్లపై కోదాడ పోలీసులు ఉక్కుపాదం మోపారు. అధిక శబ్దాలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వాహనాలపై చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న 40 మోడిఫైడ్ సైలెన్సర్లను మంగళవారం రోడ్డు రోలర్తో తొక్కించి ధ్వంసం చేశారు.

కోదాడ పట్టణంలోని రంగా థియేటర్ చౌరస్తాలో జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ, వాహనాలకు నిబంధనలకు విరుద్ధంగా మోడిఫైడ్ సైలెన్సర్లు అమర్చడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. అధిక శబ్దాలు చేసే సైలెన్సర్ల వల్ల వృద్ధులు, చిన్నారులు, రోగులతో పాటు సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా ఆసుపత్రులు, విద్యాసంస్థలు, నివాస ప్రాంతాల్లో ఇలాంటి వాహనాల వల్ల ప్రశాంత వాతావరణానికి భంగం కలుగుతోందని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా కంపెనీ అమర్చిన ప్రమాణిత సైలెన్సర్లను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. ఫ్యాన్సీ సైలెన్సర్లు, మోడిఫైడ్ ఎగ్జాస్ట్ వ్యవస్థలు ఏర్పాటు చేసి అధిక శబ్దాలు సృష్టించే వాహనాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాలను సీజ్ చేసి భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. యువత రోడ్లపై స్టంట్లు చేయడం, వేగంగా వాహనాలు నడపడం, అధిక శబ్దాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం వంటిచర్యలకు దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి సురక్షితమైన ప్రయాణానికి సహకరించాలని కోరారు. ప్రజల ప్రశాంత జీవనానికి భంగం కలిగించే వారిపై పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని, ఎవరినీ ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కోదాడ పట్టణ, ట్రాఫిక్ పోలీసులు ఇటీవల నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న సైలెన్సర్లతో సంచరిస్తున్న వాహనాలను





గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాటిని ప్రజల సమక్షంలో రోడ్డు రోలర్తో ధ్వంసం చేయడం ద్వారా చట్టాన్ని ఉల్లంఘించే వారికి గట్టి హెచ్చరిక ఇచ్చినట్లయిందని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, పట్టణ ఇన్స్పెక్టర్ శివశంకర్, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పోలీసులు చేపట్టిన ఈ చర్యపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ, ప్రజలకు ఇబ్బందులు కలిగించే మోడిఫైడ్ సైలెన్సర్లపై ఇలాంటి చర్యలు నిరంతరం కొనసాగించాలని కోరారు.

# ఆర్టీసీ బస్సును ఎత్తుకెళ్లాడు.. సినిమా రేంజ్‌లో పోలీసుల ఛేజింగ్!

- విచక్షణారహితంగా బస్సు నడుపుతూ వాహనాలకు ఢీ.. సరిహద్దులో దుండగుడి అరెస్ట్..


నిజామాబాద్/జూలై 21/(జన సంఘర్షణ):

జగిత్యాల జిల్లాలో ఓ వ్యక్తి ఆర్టీసీ బస్సును అపహరించి హల్‌చల్ సృష్టించిన ఘటన తీవ్ర కలకలం రేపింది. కోరుట్ల బస్టాండ్ నుంచి ఓ దుండగుడు ఆర్టీసీ బస్సును ఎత్తుకెళ్లి, ఏమాత్రం భయపడకుండా విచక్షణారహితంగా నడుపుతూ రోడ్డుపై ఇతర వాహనాలను ఢీకొట్టినట్లు సమాచారం. బస్సు అపహరణకు గురైన విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. బస్సు వెళ్తున్న మార్గాన్ని గుర్తించి పోలీసు వాహనాలతో దుండగుడిని వెంబడించారు. దీంతో కొంతసేపు రోడ్డుపై ఉత్కంఠభరిత వాతావరణం నెలకొంది. సినిమా తరహాలో సాగిన ఈ ఛేజింగ్ చివరకు జిల్లా సరిహద్దు వద్ద ముగిసింది. పోలీసులు వ్యూహాత్మకంగా బస్సును అడ్డగించి, దుండగుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, బస్సు అపహరణకు గల కారణాలు, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలపై విచారణ చేపట్టినట్లు సమాచారం. ఈ ఘటనలో బస్సుకు, ఇతర వాహనాలకు జరిగిన నష్టంపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. అయితే, బస్సును అపహరించి ప్రమాదకరంగా నడిపిన వ్యక్తిని పోలీసులు సకాలంలో అడ్డుకోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికానున్నాయి.



# వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆర్డీవో విజయ కుమారి!

బోధన్/జూలై 21/(జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని బాలికల కళాశాల వసతి గృహంతో పాటు ఎస్సీ, బీసీ హాస్టళ్లను ఆర్డీవో విజయ కుమారి మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు.

బోధన్ పట్టణమ్ లోని బాలికల కళాశాల వసతి గృహం తో పాటు, ఎస్సీ, బీసీ వసతి గృహాలను బోధన్ ఆర్డివో విజయ కుమారి మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహాలను తనిఖీ చేసి విద్యార్థుల కు అందిస్తున్న మెనూ పై ఆరా తీశారు. బాలికల వసతి గృహాల్లో ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని వార్డెన్ లకు సూచించారు. వార్డెన్ లు ఏళ్ల వేళల అందుబాటులో ఉండాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్న ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టాలని ఆమె వెల్లడించారు. ఆమె వెంట తాసీల్దార్ విట్టల్, ఉన్నారు

# రాణంపల్లె గ్రామంలో ఘనంగా సర్పంచ్ జన్మదిన వేడుకలు

రుద్రూర్ / జూలై 21 (జన సంఘర్షణ):




రుద్రూర్ మండల కేంద్రంలో రాణంపల్లె శంకర్ సర్పంచ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు, గ్రామ ప్రజలు, స్నేహితులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని శంకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి ఆనందోత్సాహాల మధ్య వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న శంకర్ సర్పంచ్‌కు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజలకు సేవ చేయాలని కోరుకున్నారు. వేడుకలతో రుద్రూర్ మండల కేంద్రంలో సందడి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# ఇస్నాపూర్ లో పేకాట స్థావరంపై పోలీసుల దాడి...

- 10 మంది అరెస్ట్...రూ.1.19 లక్షల నగదు స్వాధీనం...

సంగారెడ్డి//జూలై21//(జన సంఘర్షణ) :



సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్లో పేకాట ఆడుతున్న ముఠాపై పోలీసులు దాడి చేసి 10 మందిని అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఓ ఇంట్లో కొనసాగుతున్న పేకాట స్థావరంపై ఆకస్మికంగా దాడి చేశారు. ఈ సమయంలో పేకాట ఆడుతున్న 10 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు నిందితుల నుంచి రూ. 1.19 లక్షల నగదుతో పాటు పేకాటకు ఉపయోగిస్తున్న సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను పోలీస్టే స్టేషన్కు తరలించి కేసు నమోదు చేశారు. పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఇస్నాపూర్ పరిసర ప్రాంతాల్లో ఇలాంటి కార్యకలాపాలపై నిఘా కొనసాగిస్తున్నామని, సమాచారం అందిన వెంటనే చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. పేకాట స్థావరాలపై వరుస దాడులు నిర్వహిస్తూ అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

# శంషాబాద్లో హృదయ విదారక ఘటన..

- రోడ్డుపై పసికందును వదిలేసిన దుండగులు...

శంషాబాద్//జూలై21//(జన సంఘర్షణ)




శంషాబాద్లో మానవత్వాన్ని మరిచిపోయే హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. కన్న పేగు బంధాన్నే విస్మరించిన గుర్తుతెలియని వ్యక్తులు ఓ పసికందును రోడ్డుపై అనాథలా వదిలేసి వెళ్లిపోయారు. ఈ ఘటన రాళ్లగూడ ఇంద్రనగర్ లోని రాజీవ్ గృహ సమీపంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది.

రోడ్డుపై చిన్నారి ఏడుస్తుండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని శిశువును ఓదార్చి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న శంషాబాద్ పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పసికందును సురక్షితంగా తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అనంతరం శిశువును వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించి అవసరమైన సంరక్షణ కల్పించారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పసికందును అక్కడ వదిలి వెళ్లిన వారెవరు, ఏ పరిస్థితుల్లో ఈదారుణానికి పాల్పడ్డారనే కోణాల్లో విచారణ చేపట్టారు. ఘటనాస్థల పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజ్ను సేకరించి పరిశీలిస్తున్నారు. కీలక ఆధారాల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు మరం చేశారు. అభం శుభంతెలియని పసికందును రోడ్డుపై వదిలేయడం స్థానికంగా తీవ్ర ఆవేదనకు గురి చేసింది. ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలనిపోలీసులను కోరుతున్నారు. త్వరలోనే నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# మందిర్‌మార్గ్ పోలీస్ స్టేషన్‌కు సోనియా గాంధీ

న్యూఢిల్లీ,/ జూలై 21:/(జన సంఘర్షణ)



కాంగ్రెస్ అగ్రనేత్రి సోనియా గాంధీ ఢిల్లీలోని మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కు చేరు కున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నివాసం న వీ ం వ ం లో కాంగ్రెస్ నేతలు చేపట్టిన నిరసన కార్యక్రమం సందర్భంగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రియాంక గాంధీని మందిర్‌మార్గ్ పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో సోనియా గాంధీ అక్కడికి చేరుకున్నారు. నిరసన సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలతో ఢిల్లీలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. కాంగ్రెస్ నేతల నిరసన, పోలీసుల అదుపులోకి తీసుకోవడం వంటి పరిణామాలు దేశవ్యాప్తంగా రాజకీయ చర్చకు దారితీశాయి.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
బుధవారం
22 జులై 2026

# పంద్రాగస్ట్ పోటీలో సూర్య, నయనతార



తమిళ సినీ పరిశ్రమలో బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోరు జరగనుంది. గతంలో 'గజిని', 'ఆధవన్', 'మాస్సు ఎంగిర మసిలామణి' వంటి చిత్రాల్లో కలిసి నటించిన స్టార్ హీరో సూర్య, లేడీ సూపర్ స్టార్ నయనతార ఇప్పుడు ఒకరికి ఒకరు బాక్సాఫీస్ ప్రత్యర్థులుగా మారబోతున్నారు.సూర్య హీరోగా తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ / సన్స్' మరియు నయనతార ప్రధాన పాత్రలో రూపొందుతున్న 'హాయ్ ' చిత్రాలు రెండూ ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్నాయి. దీంతో స్వాతంత్య దినోత్సవ సెలవులను లక్ష్యంగా చేసుకుని ఈ రెండు సినిమాలు నేరుగా పోటీ పడనున్నాయి. మొదట 'విశ్వనాథ్ / సన్స్' చిత్రాన్ని ఆగస్టు 14న విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. అనంతరం నయనతార నటించిన 'హాయ్' మూవీ మేకర్స్ కూడా అదే తేదీని రిలీజ్ డేట్‌గా ప్రకటించడంతో బాక్సాఫీస్ రేసు మరింత ఆసక్తికరంగా మారింది. 'హాయ్' చిత్రానికి లోకేష్ కనగరాజ్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన విష్ణు
ఏడవన్ దర్శకత్వం వహిస్తున్నారు. రొమాంటిక్ కామెడీగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో కవిన్ హీరోగా నటిస్తుండగా, కె. భాగ్యరాజ్, రాధికా శరత్‌కుమార్, ప్రభు, వీటీవీ గణేలిష్, సత్యన్, అమృత శ్రీనివాసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని రౌడీ పిక్చర్స్, 7 స్క్రీన్ స్టూడియో, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మరోవైపు 'విశ్వనాథ్ / సన్స్' చిత్రంలో సూర్యకు జోడీగా మమితా బైజు నటిస్తున్నారు. కుటుంబ భావోద్వేగాలతో కూడిన హృద్యమైన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందుతోంది. ఒకవైపు ఫ్యామిలీ డ్రామాతో సూర్య, మరోవైపు రొమాంటిక్ కామెడీతో నయనతార ప్రేక్షకుల ముందుకు వస్తుండటంతో ఈ రెండు సినిమాల మధ్య బాక్సాఫీస్ పోటీ ఎలా ఉండబోతుందనే ఆసక్తి సినీ అభిమానుల్లో నెలకొంది. స్వాతంత్య దినోత్సవ వీకెండ్‌లో తమిళ సినీ పరిశ్రమలో ఈ క్లాష్ హాట్ టాపిక్‌గా మారింది.

## ఎన్టీఆర్,త్రివిక్రమ్ గాడ్ ఆఫ్ వార్ హీరోయిన్‌గా కియారాపై చర్చ



యంగ్ టైగర్ ఎన్టీఆర్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టుల్లో 'గాడ్ ఆఫ్ వార్' ఒకటి. స్టార్ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కించనున్న ఈ భారీ పాన్ ఇండియా చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన కాన్సెప్ట్ పోస్టర్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచగా.. ఇప్పుడు హీరోయిన్‌కు సంబంధించిన వార్తలు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. ఈ చిత్రంలో హీరోయిన్ పాత్ర కోసం బాలీవుడ్ స్టార్ కియారా అద్వానీ పేరును పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ చిత్రం పురాణ గాథల స్ఫూర్తితో రూపొందనున్న మైథలాజికల్ యాక్షన్ డ్రామా అని వార్తలు వస్తుండగా.. ఎన్టీఆర్ ఇందులో శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నట్లు టాక్. కథలో కీలకమైన మహిళా పాత్రకు కియారా సరిపోతారని మేకర్స్ భావిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఎన్టీఆర్, కియారా అద్వానీ ఇప్పటికే 'వార్ 2' చిత్రంలో కలిసి నటించిన సంగతి తెలిసిందే. అయితే ఆ సినిమాలో వారి మధ్య పూర్తి స్థాయి జోడీ కనిపించలేదు. కియారా నటించిన 'భరత్ అనే నేను' ఘన విజయం సాధించగా, రామ్ చరణ్‌తో చేసిన 'వినయ విధేయ రామ', 'గేమ్ ఛేంజర్' ఆశించిన ఫలితాలను అందుకోలేకపోయాయి. దీంతో కొందరు అభిమానులు ఈ విషయాన్ని సోషల్ మీడియాలో సెంటిమెంట్‌గా చర్చిస్తున్నారు. నటుడు సిద్దార్థ్ మల్హోత్రాను వివాహం చేసుకున్న తర్వాత కూడా వరుస ప్రాజెక్టులతో బిజీగా కొనసాగుతున్నారు. మరోవైపు ఎన్టీఆర్ ప్రస్తుతం దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'డ్రాగన్' షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ సినిమా పూర్తయిన తర్వాతే త్రివిక్రమ్ దర్శకత్వంలోని 'గాడ్ ఆఫ్ వార్' సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉందని సమాచారం.

## టాక్సిస్ నుంచి మనసాగదే..పాట విడుదల

యశ్ కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'టాక్సిక్' గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ఆగస్టు 26న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. చిత్ర ప్రచారంలో భాగంగా 'మనసాగదే.. ' అంటూ సాగే పాటను చిత్ర బృందం తాజాగా విడుదల చేసింది. తనిష్ బాగ్చీ, అర్మాన్ నిజామి, ఫహీమ్ అబ్దుల్లా స్వరాలు సమకూర్చిన ఈ పాటకు రామ జోగయ్యశాస్త్రి సాహిత్యం అందించారు. సిద్దార్థ్ బస్రూర్ ఆలపించారు. యశ్‌తో (జజీబర) పాటు, నయనతార, కియారా అడ్వాణీ, హ్యూమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్‌లు ఈ మూవీలో నటిస్తున్నారు ఓ సరికొత్త యాక్షన్ డ్రామాగా గీతూ మోహన్ దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు అర్థమవుతోంది.

# రామ్‌చరణ్‌తో సుకుమార్ మూవీ

**హీరోయిన్‌గా రష్మిక అంటూ ప్రచారం**



క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కాంబినేషన్‌లో మరో భారీ చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే వీరిద్దరి కలయికలో వచ్చిన 'రంగస్థలం' ఇండస్ట్రీ హిట్‌గా నిలవడంతో, ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం సినిమా స్క్రిప్ట్ పూర్తిగా సిద్ధమైనట్లు తెలుస్తుండగా, ఇప్పుడు హీరోయిన్ ఎంపిక టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. అయితే సుకుమార్ కెరీర్‌ను పరిశీలిస్తే ఒక ఆసక్తికరమైన విషయం కనిపిస్తుంది. 'ఆర్య' నుంచి 'పుష్ప 2' వరకు ఆయన తెరకెక్కించిన ప్రతి సినిమాలో కొత్త హీరోయిన్‌కే అవకాశం ఇచ్చారు. ఒకసారి నటించిన కథానాయికను వెంటనే మరో సినిమాలో రిపీట్ చేయలేదు. ఇదే ఆయనకు సెంటిమెంట్‌గా మారింది. అయితే ఈసారి రామ్ చరణ్ సినిమా కోసం ఆ సెంటిమెంట్‌ను పక్కన పెట్టే ఆలోచనలో ఉన్నారని ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం పలువురు నటీమణుల పేర్లు పరిశీలించినప్పటికీ, రష్మిక మందన్న పేరు ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది. దర్శకుడు సుకుమార్‌తో 'పుష్ప', 'పుష్ప 2' చిత్రాల్లో రష్మిక సక్సెస్‌ఫుల్‌గా పనిచేయడంతో, మరోసారి ఆమెనే ఎంపిక చేయాలనే అభిప్రాయం టీమ్‌లో వ్యక్తమవుతున్నట్లు సమాచారం. రామ్ చరణ్, రష్మిక మందన్న ఇప్పటివరకు ఏ సినిమాలోనూ కలిసి నటించలేదు. ఈ ఫ్రెష్ పెయిర్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందని చిత్రబృందం భావిస్తోందట. అంతేకాకుండా ప్రస్తుతం రష్మిక పాన్ ఇండియా స్థాయిలో వరుస విజయాలతో దూసుకుపోతుండటం కూడా నిర్మాతలకు అదనపు బలంగా మారింది. ఆమె క్రేజ్ సినిమాకు
అన్ని భాషల్లో మంచి బిజినెస్‌కు దోహదపడుతుందనే అంచనాలు ఉన్నాయి. ఒకవేళ రష్మికనే హీరోయిన్‌గా ఖరారు చేస్తే, సుకుమార్ తన కెరీర్‌లో తొలిసారి ఒకే హీరోయిన్‌ను వరుసగా రెండు చిత్రాల్లో తీసుకున్న దర్శకుడిగా నిలుస్తారు. అయితే ప్రస్తుతం ఇవన్నీ ప్రచారంలో ఉన్న వార్తలే. చిత్రబృందం

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony, Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi.
RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co